# నవజ్యోతి
తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 288 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | శనివారం 08-08-2026


## రామాయంపేట లో ముగ్గురు విద్యార్థులు అదృశ్యం..



- గాలింపు ముమ్మరం.
- కేఎస్ఆర్ కాలనీలో కలకలం.. ముగ్గురు బాలురు కనిపించక కేసు నమోదు

6

## తాత్కాలిక పరిష్కారం, శాశ్వతంపై ప్రశ్నలు!

- సూరారం డ్రైనేజీ సమస్యపై హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ తక్షణ చర్యలు
- రెండు ప్రాంతాల్లో మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట



4

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

తెలంగాణ పోలీసుల అవగాహన ప్రచారం

జీవితాన్ని ఎంచుకోండి.. మాదకద్రవ్యాలను కాదు




మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరిస్తూ తెలంగాణ పోలీసులు ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

2

# పంటలే రైతుకు భరోసా



- వరి సాగు విస్తరణపై ప్రభుత్వం హెచ్చరిక
- ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కలెక్టర్లతో మంత్రుల వీడియో సమీక్ష

2



# ఏఐతో కొత్త వైరస్‌ల సృష్టి

- స్టాన్‌ఫోర్డ్ పరిశోధనకు ప్రపంచవ్యాప్త గుర్తింపు
- బ్యాక్టీరియాలపై పోరాటానికి కొత్త దారి
- భద్రతా ప్రమాణాలపై నిపుణుల చర్చ

**అమెరికా, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**

కృత్రిమ మేధ రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఆర్క్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఏఐ సాయంతో ప్రకృతిలో ఇప్పటివరకు లేని కొత్త వైరస్‌లను రూపొందించి శాస్త్ర ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. ఈ పరిశోధనలో రూపొందించిన వైరస్‌లలో 16 వైరస్‌లు ప్రయోగశాల పరీక్షల్లో విజయవంతంగా పనిచేయడం విశేషంగా మారింది. ఈ వైరస్‌లు మనుషులు, జంతువులు, మొక్కలకు ఎలాంటి హాని కలిగించకుండా కేవలం బ్యాక్టీరియాలపై మాత్రమే దాడి చేసే విధంగా రూపొందించబడ్డాయి. శాస్త్రవేత్తలు ఈ పరిశోధన కోసం 'ఈవో–1', 'ఈవో–2' పేర్లతో ప్రత్యేక కృత్రిమ మేధ నమూనాలను వినియోగించారు.

2

## కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు



# నేతన్నల కోసం సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ

- చేనేత పథకాల పునరుద్ధరణకు డిమాండ్
- హామీలు వెంటనే అమలు చేయాలన్న విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన చేనేత రంగం కాంగ్రెస్ పాలనలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను నిలిపివేయడం వల్ల వేలాది నేతన్న కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అమలైన 'నేతన్న బీమా',

మిగతా 2 లో..



## డీఎస్సీపై జగన్ విమర్శల వెల్లువ

- సీబీఐ విచారణకు ఎందుకు భయమని ప్రశ్న
- నిరుద్యోగుల నిరసనలపై దాడుల ఆరోపణ
- మూడు కీలక డిమాండ్లు చేసిన వైసీపీ అధినేత

2

డీఎస్సీ–2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాల ఆరోపణలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం నిర్బంధ చర్యలకు దిగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు.

# చేనేత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా వేడుకలు
- 100కుపైగా చేనేత స్టాల్స్ ప్రారంభం
- కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కార గ్రహీతలకు సత్కారం
- నేతన్నలకు అండగా తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్రస్థాయి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత రంగ అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యంతో పనిచేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత

మిగతా 2 లో..





## మద్యం మత్తు ఘాతుకంపై సీఎం ఆగ్రహం

- డాక్టర్ ప్రియాంకకు న్యాయం చేయాలని ఆదేశం
- నిందితులకు కఠిన శిక్షలు తప్పవన్న చంద్రబాబు
- విచారణ వేగవంతం చేయాలని అధికారులకు

2

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ నంబర్ వన్

- దేశవ్యాప్తంగా తొమ్మిది కీలక ప్రమాణాల్లో అగ్రస్థానం
- రెండు నెలల్లోనే విశేష పురోగతి సాధించిన పోలీసు శాఖ

2



# జీహెచ్ఎంసీ బరిలో బీజేపీ ఒంటరి పోరు



- పొత్తులు ఉండవని రామచందర్‌రావు స్పష్టం
- పార్టీ బలోపేతంపై జాతీయ నాయకత్వం దిశానిర్దేశం
- డబుల్ ఇంజిన్ సర్కార్ లక్ష్యమన్న బీజేపీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**

రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణలో ఎటువంటి రాజకీయ పొత్తులు లేకుండానే ఎన్నికల బరిలోకి దిగుతామని ఆయన వెల్లడించారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో


మిగతా 2 లో..

# ఏఐతో పాలనకు పదును




- హైదరాబాద్‌లో ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ సదస్సు
- పాలనలో కృత్రిమ మేధ వినియోగంపై చర్చ
- ప్రజాసేవలను మరింత సమర్థంగా తీర్చిదిద్దే లక్ష్యం

2




4

## గాజులరామారంలో ఆక్రమణలపై ఉక్కుపాదం

చౌరస్తా నుంచి మహాదేవపురం వరకు ఆక్రమణల తొలగింపు

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

హైదరాబాద్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):

"డ్రగ్స్‌కు నో చెప్పండి.. జీవితాన్ని ఎంచుకోండి" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్ ద్వారా యువతలో చైతన్యం కల్పించే ప్రయత్నం చేస్తున్నారు.

మాదకద్రవ్యాల బారిన పడితే విద్య, ఉపాధి, కుటుంబ జీవితం, ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటాయని పోస్టర్‌లో స్పష్టం చేశారు. యువత తమ భవిష్యత్తును స్వయంగా నిర్మించుకోవాలని, క్షణిక ఆనందాల కోసం జీవితాన్ని పణంగా పెట్టవద్దని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు పెరగడంతో పాటు నేరాల వైపు మళ్లే ప్రమాదం కూడా ఉంటుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సమాజం, కుటుంబం, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తారని గుర్తు చేశారు. విద్యార్థులు, యువకులు చెడు స్నేహాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలపై సమాచారం లభించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను చైతన్యపరుస్తున్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, "మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది" అనే సందేశంతో తెలంగాణ పోలీసులు ప్రజలకు పిలుపునిచ్చారు.

## జీహెచ్ఎంసీ బరిలో బీజేపీ ఒంటరి పోరు

మొదటిపేజీ తరువాయి

సమావేశమైన అనంతరం రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. జీహెచ్ఎంసీ ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోందని, స్వతంత్రంగా పోటీ చేసి ప్రజల మద్దతు పొందడమే లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర బీజేపీలో ఎలాంటి విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేస్తున్నారని, సరైన సమయంలో పలువురు కీలక నేతలు బీజేపీలో చేరనున్నారని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంలో పెరుగుతున్న అవినీతి, పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జాతీయ నాయకత్వం సూచించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు తీరుపై ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని రామచందర్‌రావు పునరుద్ఘాటించారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలు రాష్ట్రంలో బీజేపీ బలాన్ని చాటిచెప్పే కీలక మైలురాయిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## డీఎస్సీపై జగన్ విమర్శల వెల్లువ

తాడేపల్లి, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):

ఈ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం ఇంత తీవ్రంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని చెబుతున్న ప్రభుత్వం సీబీఐ విచారణకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. విడుదల చేసిన ప్రకటనలో జగన్ మాట్లాడుతూ, డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలపై అధికార పార్టీ నాయకులు దాడి చేశారని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే శిబిరాలను ధ్వంసం చేసి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగ యువతపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడులు జరిగాయని పేర్కొన్నారు. మహిళలపైనా దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసన శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ అన్నారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల తదితర ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలను అడ్డుకోవడంతో పాటు నాయకులను అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగులకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియపై ప్రభుత్వం పారదర్శకత ఉందని చెబుతున్న నేపథ్యంలో సీబీఐ విచారణకు అంగీకరించడంలో ఇబ్బంది ఏమిటని జగన్ ప్రశ్నించారు. నిజంగా ఎలాంటి అక్రమాలు జరగకపోతే స్వతంత్ర దర్యాప్తుకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు. డీఎస్సీ నియామకాల వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, విద్యా దీవెన, వసతి దీవెన కింద పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.9,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున నిరుద్యోగ భృతిని గత బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాలను ధ్వంసం చేయడం, అరెస్టులు చేయించడం ద్వారా వాస్తవాలను దాచలేరని జగన్ పేర్కొన్నారు. డీఎస్సీ వ్యవహారంలో నిజాలు వెలుగులోకి వచ్చే వరకు, నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## మద్యం మత్తు ఘాతుకంపై సీఎం ఆగ్రహం

అమరావతి, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):

రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో కారు నడుపుతూ పీజీ వైద్య విద్యార్థులపై దాడి చేసి డాక్టర్ ప్రియాంక బ్రెయిన్ డెడ్ కావడానికి కారణమైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, బాధితులకు న్యాయం జరిగేలా విచారణను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలోని సచివాలయంలో శుక్రవారం ఈ ఘటనపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. నిందితులను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని అధికారులు తెలియజేయగా, కేసు దర్యాప్తును వేగంగా పూర్తి చేసి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ ప్రియాంక ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఆమెకు అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, వైద్య బృందాలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఘటనలో గాయపడిన మరో వైద్య విద్యార్థి ఉమేష్ ఆరోగ్య పరిస్థితిని కూడా అడిగి తెలుసుకున్నారు. రాజమహేంద్రవరంలోని ప్రసాద్ ఆదిత్య మాల్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు మాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా, భద్రతా సిబ్బంది బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో మద్యం సేవించినట్లు గుర్తించి వారిని అనుమతించలేదు. దీంతో ఆగ్రహించిన యువకులు కారుతో వేగంగా బయటకు వెళ్లే క్రమంలో అక్కడ ఉన్న వైద్య విద్యార్థులపై దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. జీఎస్ఎల్ మెడికల్ కాలేజీకి చెందిన పీజీ విద్యార్థులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ఉమేష్ స్కూటీపై వెళ్తుండగా నిందితులు కారుతో పలుమార్లు ఢీకొట్టినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనలో ప్రియాంక తీవ్రంగా గాయపడగా, ఉమేష్‌కు కూడా గాయాలయ్యాయి. అనంతరం బాధితులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రియాంకను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినప్పటికీ, తీవ్ర తలగాయాల కారణంగా ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. ఘటనపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఏఐతో కొత్త వైరస్‌ల సృష్టి

మొదటిపేజీ తరువాయి

సాధారణంగా భాషా నమూనాలు పదాల క్రమాన్ని అంచనా వేసినట్లే, ఈ వ్యవస్థలు డీఎన్ఏలోని జన్యు అక్షరాల క్రమాన్ని అంచనా వేసి కొత్త వైరస్‌ల నిర్మాణాలను రూపొందించాయి. లక్షలాది జన్యు సమాచార నమూనాలను విశ్లేషించిన అనంతరం పూర్తిగా కొత్త వైరస్‌ల రూపకల్పన సాధ్యమైందని పరిశోధకులు వెల్లడించారు. ఏఐ రూపొందించిన లక్షల వైరస్ నమూనాల్లో సుమారు 300 నమూనాలను ఎంపిక చేసి ప్రయోగశాలలో తయారు చేశారు. అనంతరం వాటిని వివిధ రకాల బ్యాక్టీరియాలపై పరీక్షించారు. ఈ పరీక్షల్లో 16 వైరస్‌లు సమర్థవంతంగా పనిచేసి తమ సామర్థ్యాన్ని నిరూపించాయి. కొన్ని వైరస్‌లు సహజసిద్ధంగా ఉండే వైరస్‌ల కంటే వేగంగా అభివృద్ధి చెందగా, మరికొన్ని సాధారణ వైరస్‌లకు నిరోధక శక్తి పెంచుకున్న ఈ.కోలై వంటి బ్యాక్టీరియాలను కూడా విజయవంతంగా నాశనం చేశాయి. ప్రపంచవ్యాప్తంగా యాంటీబయోటిక్స్‌కు లొంగని బ్యాక్టీరియా సమస్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిశోధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. భవిష్యత్తులో అవసరానికి అనుగుణంగా నిర్దిష్ట బ్యాక్టీరియాలను లక్ష్యంగా చేసుకుని కొత్త వైరస్‌లను రూపొందించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీంతో ప్రస్తుతం చికిత్సకు సవాలుగా మారుతున్న అనేక బ్యాక్టీరియా సంబంధిత వ్యాధులను ఎదుర్కొనే కొత్త మార్గాలు అందుబాటులోకి రావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఈ సాంకేతికత విజయంతో పాటు కొన్ని ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. వైరస్‌ల జన్యు నిర్మాణాన్ని కృత్రిమ మేధతో రూపొందించే సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో దుర్వినియోగ అవకాశాలను పూర్తిగా కొట్టిపారేయలేమని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రంగంలో స్పష్టమైన అంతర్జాతీయ నియంత్రణలు, భద్రతా ప్రమాణాలు అవసరమని వారు సూచిస్తున్నారు. ప్రస్తుతం నిర్వహించిన పరిశోధనలో మనుషులు, జంతువులు లేదా మొక్కలకు సోకే వైరస్‌ల సమాచారాన్ని వినియోగించలేదని పరిశోధకులు స్పష్టం చేశారు. అన్ని ప్రయోగాలను కఠిన భద్రతా ప్రమాణాల మధ్య నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ పరిశోధన ఫలితాలు ప్రముఖ శాస్త్రీయ పత్రిక 'సైన్స్'లో ప్రచురితమవడంతో ప్రపంచ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించాయి. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీయగల ఈ సాంకేతికత భవిష్యత్తులో మరిన్ని కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు

మొదటిపేజీ తరువాయి

'నేతన్నకు చేయూత' వంటి పథకాలు చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాయని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 55 వేల మందికిపైగా చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. కార్మికుల పొదుపును ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం భారీగా వాటా జమ చేసిన 'నేతన్నకు చేయూత' పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాల తయారీ వంటి ప్రభుత్వ ఆర్డర్ల ద్వారా వేలాది కుటుంబాలకు నిరంతర ఉపాధి లభించిందని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాలను నిలిపివేసి చేనేత రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం బీమా, చేయూత పథకాలతో పాటు ఇతర ప్రోత్సాహకాలు కూడా అమలు కావడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని కేటీఆర్ మండిపడ్డారు. చేనేత భరోసా కింద ప్రతి ఏడాది రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సహాయం, వ్యక్తిగత రుణమాఫీ, సహకార సంఘాల రుణాల మాఫీ, జీఎస్టీ భారం భరిస్తామన్న హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నల జీవితాల్లో మార్పు కనిపించలేదని విమర్శించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా చేనేత రంగానికి అన్యాయం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డుల రద్దు, పలు సంక్షేమ పథకాల నిలిపివేత, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధింపు వంటి నిర్ణయాలు రంగంపై తీవ్ర ప్రభావం చూపాయని అన్నారు. చేనేత విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిలో ఎలాంటి తేడా లేదని విమర్శించారు. రాష్ట్రంలోని నేతన్నల తరఫున ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కేటీఆర్ తన లేఖలో డిమాండ్ చేశారు.

## చేనేత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

పురస్కారాలకు ఎంపికైన కళాకారులను ఘనంగా సత్కరించారు. చేనేత రంగానికి విశేష సేవలు అందించిన వారికి పురస్కారాలు అందజేసి అభినందించారు. చేనేత కళాకారుల ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా ఈ రంగానికి మరింత గుర్తింపు తీసుకురావచ్చని మంత్రి పేర్కొన్నారు.అనంతరం పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ఏర్పాటు చేసిన 100కు పైగా స్టాల్స్‌ను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. సంప్రదాయ చేనేత నైపుణ్యంతో రూపొందించిన చీరలు, వస్త్రాలు, గృహోపకరణాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శన ఆగస్టు 7 నుంచి 16 వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన తుమ్మల నాగేశ్వరరావు, చేనేత అనేది కేవలం ఉపాధి రంగం మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, వారసత్వానికి ప్రతీక అని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ కళను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అంతరించిపోతున్న సంప్రదాయ చేనేత కళలకు పునర్వైభవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ చేనేత ఉత్పత్తులు దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. గద్వాల చీరలు, పోచంపల్లి ఇక్కత్, నారాయణపేట వస్త్రాలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీస్, కరీంనగర్ బెడ్‌షీట్లు తెలంగాణకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని చెప్పారు. సంప్రదాయ చేనేతకు ఆధునిక మార్కెట్ అవకాశాలను కల్పిస్తూ ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని మంత్రి వివరించారు. నేతన్న పొదుపు పథకం, నేతన్నకు భద్రత పథకం, చేనేత రుణమాఫీ, నేతన్న భరోసా వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల కుటుంబాలకు భద్రత, ఉపాధి, ఆదాయ వృద్ధి కల్పించడమే ప్రభుత్వ పరమావధి అని పేర్కొన్నారు.

## ఏఐతో పాలనకు పదును

హైదరాబాద్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):

రాష్ట్రంలో సాంకేతిక ఆధారిత పాలనకు మరింత ఊతమిచ్చే దిశగా కృత్రిమ మేధ వినియోగాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో జీఓవీకనెక్ట్, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (మీసేవ) సంయుక్తంగా నిర్వహించిన 'ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాన్‌క్లేవ్–తెలంగాణ'ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా విధాన రూపకర్తలు, సాంకేతిక రంగ నిపుణులు, డిజిటల్ పాలన నిపుణులతో మంత్రి ముఖాముఖి చర్చలు నిర్వహించారు. ప్రభుత్వ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజలకు సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సేవల అందజేతలో సామర్థ్యాన్ని పెంచడం, నిర్ణయాల ప్రక్రియను వేగవంతం చేయడం, ప్రజల సమస్యల పరిష్కారంలో సాంకేతికతను వినియోగించడం వంటి అంశాలపై సదస్సులో విస్తృత చర్చ జరిగింది. భవిష్యత్ పాలనలో కృత్రిమ మేధ కీలక సాధనంగా మారనున్న నేపథ్యంలో దాని వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు శాఖల్లో డిజిటల్ సేవలను విస్తృతంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ సేవలను మరింత ప్రజానుకూలంగా మార్చేందుకు కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు తక్కువ సమయంలో మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాల ద్వారా ప్రభుత్వ సేవలలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రజల అవసరాలను మరింత సమర్థంగా తీర్చే అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. సాంకేతికతను ప్రజా సంక్షేమానికి ఉపయోగించే దిశగా తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అభివృద్ధి చెందుతున్న ఇతర సాంకేతిక పరిజ్ఞానాల వినియోగానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

## సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ నంబర్ వన్

హైదరాబాద్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):

సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు సేవల అందజేత, సాంకేతిక వినియోగం వంటి కీలక అంశాల్లో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. ప్రధాని ప్రధాన కార్యదర్శి పి.కె. మిశ్రా అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ కార్యదర్శి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ప్రధానమంత్రి కార్యాలయ ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహించిన 'ప్రగతి' సమీక్ష సమావేశంలో దేశంలోని అన్ని రాష్ట్రాల పనితీరును పరిశీలించగా తెలంగాణ అగ్రస్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. సైబర్ భద్రత రంగంలో రాష్ట్రం సాధించిన ఈ విజయం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. గత రెండు నెలల క్రితం వరకు రాష్ట్ర పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోయినా, ప్రత్యేక కార్యాచరణతో పరిస్థితిని పూర్తిగా మార్చగలిగామని డీజీపీ పేర్కొన్నారు. సమగ్ర కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రంలోని సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరును సమీక్షించిన అనంతరం జిల్లా పోలీసు యంత్రాంగం, కమిషనరేట్లు, సైబర్ విభాగం మధ్య సమన్వయ లోపాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో ఫలితాలు కనిపించాయని వివరించారు. దేశంలోనే తొలి సైబర్ సెక్యూరిటీ బ్యూరోను తెలంగాణలో ఏర్పాటు చేయడం రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిందని డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. రూ.5 లక్షలకు మించిన సైబర్ మోసాల కేసుల్లో ఈ–జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని అమలు చేస్తూ ఇప్పటికే 49 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 88 శాతం విజయవంతమైన స్పందన నమోదు కాగా, బాధితుల డబ్బు తిరిగి అందించే మనీ రిస్టోరేషన్ వ్యవస్థలో 81 శాతం ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. సహయోగ్ పోర్టల్‌లో 88 శాతం అనుసరణ, సమన్వయ పోర్టల్‌లో 97 శాతం అంతర్రాష్ట్ర సమన్వయం సాధించినట్లు డీజీపీ తెలిపారు. సైబర్ నేరాల విచారణకు ఉపయోగపడేలా 5,500 ప్రొఫైళ్లు, 15 వేల అనుబంధ సమాచారాలను పోర్టల్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా గుర్తించిన మ్యూల్ అకౌంట్ హాట్‌స్పాట్ రాష్ట్రాల జాబితాలో తెలంగాణ లేకపోవడం మరో ముఖ్య విజయమని అన్నారు. సైట్రైన్ కార్యక్రమం ద్వారా 524 మంది పోలీసు అధికారులకు సైబర్ నేరాల దర్యాప్తుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందించినట్లు తెలిపారు. సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం నిర్వహించామని, సుమారు 8.5 లక్షల మందికి సైబర్ నేరాలపై, 2 లక్షల మందికి డిజిటల్ అరెస్ట్ మోసాలపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. ఈ విజయానికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఆమె బృందం, రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు చేసిన కృషి కారణమని డీజీపీ సి.వి. ఆనంద్ ప్రశంసించారు. సైబర్ భద్రతతో పాటు సీసీటీఎన్ఎస్, డయల్–112, మాదకద్రవ్యాల నియంత్రణ, కృత్రిమ మేధ ఆధారిత పోలీసింగ్ వంటి అన్ని రంగాల్లో తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## పంటలే రైతుకు భరోసా

హైదరాబాద్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):

రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులు అధిక నీటి అవసరమున్న వరి సాగును మరింత విస్తరించకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటక, సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి నిర్వహించిన ఈ సమీక్షలో వ్యవసాయం, మండల ప్రజావాణి, వనమహోత్సవం, రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు వరి సాగును పెంచే అవకాశం ఉందని, భవిష్యత్తులో అది నష్టాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. ప్రతి రైతుకు స్పష్టమైన సమాచారం చేరేలా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పంటల వైవిధ్యీకరణ కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 99.81 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగిందని తెలిపారు. ప్రజాప్రతినిధుల సహకారంతో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ వచ్చే నెల నుంచి ఎల్‌నినో ప్రభావం పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణంలో కనీసం 50 శాతం మేర ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ఆయిల్‌పామ్, పప్పుధాన్యాలు, కూరగాయలు, కంది, అలసందలు, పొద్దుతిరుగుడు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుతం 16 లక్షలకు పైగా కొత్త కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు.

# ఫీజుల బకాయిలపై బీజేవైఎం సంతకాల సేకరణ

- రూ.15 వేల కోట్లు విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక..

**భిక్కనూర్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**



భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు నంది వేణు ఆదేశాల మేరకు భిక్కనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఫీజు బకాయిల విడుదల కోసం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని బీజేవైఎం నాయకులు పుట్నాల పవన్, మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద దాదాపు 40 లక్షల మంది విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.15 వేల కోట్లను విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. వెంటనే బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి స్థానిక ఎమ్మెల్యేల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంతంపల్లి ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకుడు రవీందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అరిగి నర్సింలు, గ్రామాధ్యక్షులు భాస్కర్, సందీప్, బాల్ లింగం, రామచంద్రం, బండమీది రాజు, జేపీ చంద్రశేఖర్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలి

- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర
- సీసీటీఎన్ఎస్‌లో వెంటనే నమోదు చేసి రశీదు ఇవ్వాలి.. రిసెప్షన్ సిబ్బందికి ఎస్పీ ఆదేశాలు..

**కామారెడ్డి, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**






ప్రజలు పోలీస్ స్టేషన్‌కు అందించే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రిసెప్షన్ వర్టికల్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రతి ఫిర్యాదును ఎలాంటి ఆలస్యం లేకుండా సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేసి, ఫిర్యాదుదారుడికి వెంటనే రశీదు అందించాలని సూచించారు. ఫిర్యాదు స్వీకరణ నుంచి పరిష్కారం వరకు పారదర్శకత పాటించాలని, పెండింగ్‌లో ఉంచకుండా చట్టపరంగా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సైబర్ నేరాల బాధితుల ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, వారికి సరైన మార్గదర్శకత్వం అందించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖకు ప్రజలతో తొలి పరిచయ వేదిక రిసెప్షన్ వర్టికల్ కావడంతో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. నరసింహారెడ్డి, సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, రిసెప్షన్ వర్టికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మహంకాళి బోనాల ఉత్సవాలు

- మ్యాదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు, పలారం బండి ప్రదర్శన..

**భిక్కనూర్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**



ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని భిక్కనూర్‌లో మ్యాదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో మహంకాళి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండుగ సందర్భంగా బయట ప్రాంతాల్లో నివసిస్తున్న బంధువులు, చుట్టాలు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. మ్యాదరి మహేంద్ర సంఘం కార్యాలయం నుంచి మహంకాళి అమ్మవారి ఆలయం వరకు మహిళలు బోనాలు ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా వెళ్లారు. ఈ సందర్భంగా పలారం బండి ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఘనంగా నిర్వహించిన మ్యాదరి మహేంద్ర సంఘం సభ్యులను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, మహిళలు, యువకులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్త పోలింగ్ బూత్‌ల కోసం డీసీ కి బీజేపీ వినతిపత్రం

- కాలనీల్లో పోలింగ్ కేంద్రాలు..ఓటర్ల డిమాండ్ కు బీజేపీ మద్దతు
- వృద్ధులు, గర్భిణులకు చేరువలో కొత్త పోలింగ్ బూత్ ల కోసం బీజేపీ డిమాండ్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి)**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సర్ ) కార్యక్రమంలో భాగంగా బౌరంపేట్ డివిజన్ పరిధిలోని భారీ జనాభా కలిగిన కాలనీల్లో నూతన పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేయాలని కోరుతూ బౌరంపేట్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బౌరంపేట్ రెవెన్యూ పరిధిలోని సింహపురి కాలనీ వేలాది ఓటర్లతో కూడిన అతిపెద్ద కాలనీ అయినప్పటికీ, అక్కడి ప్రజలు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బౌరంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం సింహపురి కాలనీ ఓటర్లు 42 నుంచి 48 వరకు ఉన్న వివిధ పోలింగ్ బూత్ లలో విభజించబడినందున, కాలనీలోనే ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ, లహరి గ్రీన్ పార్క్ నివాసితులు కూడా రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఈ ప్రాంతాల్లోని ఓటర్లను ఒకేచోట సమీకరించి కాలనీలోనే రెండు కొత్త పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మల్లంపేట్ కెవిఆర్ వ్యాలీ ఓటర్లకు కెవిఆర్ వ్యాలీలోనే, మల్లంపేట్ ఇందిరమ్మ కాలనీ ఓటర్లకు అదే కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గండిమైసమ్మ చౌరస్తా పరిధిలోని ఓటర్ల కోసం ప్రగతి మోడల్ స్కూల్ లేదా శ్లోకా స్కూల్ లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కాలనీలన్నింటిలో వేల సంఖ్యలో ఓటర్లు ఉన్నందున, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ద్వారా వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లల తల్లులు, దివ్యాంగులు మరియు సాధారణ ఓటర్లకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలు కాలనీలకు చేరువలో ఉంటే ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగి 95 శాతానికి చేరుకునే అవకాశముందని, ఎన్నికల సంఘం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, డి. సీతారాం రెడ్డి, ఆర్. నరసింహాచారి, ఎస్. నర్సింగరావు, యువమోర్చా నాయకులు ఎం. ఆతేష్ బాబు, సార నవీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# కాచిగూడలో కలకలం..60 కేజీల కుళ్లిన మాంసం స్వాధీనం!

**హైదరాబాద్ ఆగస్టు 7 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి రాజగోపాల్) :**





కాచిగూడలోని ఒక కబేళా మాంసం విక్రయశాల పై హఠాత్తుగా జరిగిన తనిఖీలు నగరంలో పెద్ద కలకలం రేపాయి. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతూ విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన భారీ మొత్తంలో కుళ్లిన మాంసాన్ని అధికారులు పట్టుకున్నారు. సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల నుంచి అందిన పక్కా సమాచారంతో హెచ్-ఫాస్ట్ అధికారులు శుక్రవారం కాచిగూడ కబేళాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 60 కేజీల కుళ్లిన మాంసం అమ్మకానికి సిద్ధంగా ఉంచిన దాదాపు 60 కిలోల కుళ్లిన మాంసాన్ని అధికారులు గుర్తించి, వెంటనే స్వాధీనం చేసుకున్నారు. ఫినాయిల్‌తో ధ్వంసం: ఆ మాంసం మరెక్కడా వినియోగించకుండా ఉండేందుకు అధికారులు దానిపై ఫినాయిల్ చల్లి పూర్తిగా నిర్వీర్యం చేశారు.

**యజమానిపై కేసు నమోదు:**

కుళ్లిన మాంసాన్ని నిల్వ ఉంచిన కబేళా యజమాని 'అఖిల్' పై అధికారులు కేసు నమోదు చేసి, భారీగా జరిమానా విధించారు.

**అధికారుల హెచ్చరిక:**

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా ఇలాంటి కుళ్లిన, నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై భవిష్యత్తులో మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా బోనాల వేడుకలు

**అమ్మవారికి బోనం సమర్పించిన మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్..**



**కామారెడ్డి, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**

కామారెడ్డి మున్సిపల్ వాటర్ వర్క్స్, శానిటేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు చైర్ పర్సన్ తెలిపారు. భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలను నిర్వహించిన వాటర్ వర్క్స్, శానిటేషన్ సిబ్బందిని ఆమె అభినందించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న మున్సిపల్ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కాసార్ల గోదావరి స్వామి, కౌన్సిలర్ కాళ్ల గణేష్, మున్సిపల్ అధికారులు, వాటర్ వర్క్స్, శానిటేషన్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## కాలువల్లో చెత్త వేయవద్దు: ఏవీ రంగనాథ్ హైడ్రా కమిషనర్

**హైదరాబాద్ ఆగస్టు 7 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి రాజగోపాల్) :**



ఇంట్లో పనికిరాని వస్తువులన్నీ వరద, మురుగు కాలువల్లోకి వెళ్తున్నాయి. దీంతో వరద ప్రవాహానికి తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వర్షం పడినప్పుడు వరద కాలువల్లో వరద సాఫీగా సాగక కాలనీలను, రహదారులను ముంచెత్తుతున్నాయి. నాలాల్లో చెత్త వేయవద్దని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగర వ్యాప్తంగా ఎక్కడ చెత్త తీసినా టన్నులకొద్దీ చెత్త బయట పడుతోంది. ప్రజలు ఈ విషయంలో దృష్టి సారించి చెత్తను కాలువల్లో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించే స్వచ్ఛ ఆటోలను వినియోగించుకోవాలని సూచించారు. లేని పక్షంలో చెత్త కుండీల్లో చెత్తను వేయాలనీ అయన నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## తిప్పాపూర్ పీఏసీఎస్ చైర్ పర్సన్ గా తిరుపారి భీమ్ రెడ్డి

**ప్రభుత్వ ఉత్తర్వులు జారీ.. షబ్బీర్ అలీకి ధన్యవాదాలు తెలిపిన భీమ్ రెడ్డి !**

**భిక్కనూర్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**



భిక్కనూర్ మండలం తిప్పాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్‌పర్సన్‌గా తిరుపారి భీమ్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా తిరుపారి భీమ్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనపై విశ్వాసం ఉంచిన పార్టీ నాయకత్వానికి, ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## నారాయణ పాఠశాలలో వైభవంగా బోనాల సంబరాలు

**మేడ్చల్, ఆగష్టు 07(నవజ్యోతి ప్రతినిధి )**



మేడ్చల్‌లోని నారాయణ పాఠశాలలో బోనాల పండుగ అత్యంత ఘనంగా, ఆహ్లాదకరంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎ.జి.యం. పురుషోత్తమ్‌రెడ్డి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తులసి విచ్చేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తులసి మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పండుగలో భాగంగా చిన్నారులు మట్టి కుండలలో భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి, అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది నిర్మల, అఖిల, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ అక్షర డిగ్రీ కళాశాలలో ఘనంగా బోనాల వేడుకలు



**మేడ్చల్, ఆగష్టు 07( నవజ్యోతి ప్రతినిధి)**

మేడ్చల్ పట్టణంలోని అక్షర డిగ్రీ కళాశాలలో తెలంగాణ సంస్కృతిని చాటే బోనాల పండుగను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. డప్పు చప్పుళ్లు, జానపద నృత్యాలు, భక్తి గీతాలతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా కళాశాల సీఈఓ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు తమ సాంస్కృతిక విలువలను పరిరక్షిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ భాస్కర్ రావ్, అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రభాకర్, డైరెక్టర్ రాజేష్, ప్రిన్సిపల్ శిల్ప, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డ్రగ్స్ కి యువత దూరంగా ఉండాలి : సర్పంచ్ మోతిబాయి లక్ష్మణ్ సింగ్




**మానోహారాబాద్, 07 ఆగష్టు ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**

డ్రగ్స్ కి యువత దూరంగా ఉండాలని మనోహరాబాద్ మండలం పరికిబండ గ్రామ సర్పంచ్ మోతిబాయి లక్ష్మణ్ సింగ్ అన్నారు.రాష్ట్ర డీజీపీ పివి ఆనంద్, జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ల ఆదేశాల మేరకు పోలీసులు పర్కిబండ గ్రామంలో నిర్వహించిన డాగ్ స్క్వాడ్ అవగాహన కార్యక్రమం లో ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయం వద్ద మరియు గ్రామంలోని అన్ని కిరాణా దుకాణాల వద్ద ప్రజలకు భద్రత, అప్రమత్తత మరియు చట్టాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, హోటల్ లు, కిరాణా షాప్ ల వద్ద డాగ్ స్క్వాడ్ తో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యాప్రల్ వార్డులో మొక్కల పంపిణీ కార్యక్రమం

### పచ్చదన పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి: డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం



**యాప్రల్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**

కీసర సర్కిల్ యాప్రల్ వార్డు పరిధిలో ప్లాంటర్ బాక్సుల్లో మొక్కలు నాటేందుకు స్థానిక ప్రజలకు గౌరవ డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్లాంటర్ బాక్సుల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా వార్డును మరింత పచ్చదనంతో తీర్చిదిద్దవచ్చని తెలిపారు. ప్రజల సహకారంతో స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు మున్సిపల్ కార్పొరేషన్ కృషి చేస్తోందన్నారు.మొక్కలు అందుకున్న వార్డు ప్రజలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, మొక్కలను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామని తెలిపారు.

## తల్లి పాలే బిడ్డకు ఔషధం...

### గర్భిణీలకు, బాలింతలకు తీసుకునే ఆహారంపై అవగాహన....

### అంగన్వాడి టీచర్ శోభారాణి....



**తూప్రాన్, చేగుంట, 07 ఆగష్టు ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**

చేగుంట మండలం కసన్ పల్లి గ్రామంలోనీ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్ శోభారాణి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు మరియు బాలింతలకు సరైన పోషణ అందాలంటే సమతుల్యంగా రోజు శ్రేష్టమైన పాలు, గుడ్లు, పండ్లు, ఆకుకూరలు, పప్పు, చిరుధాన్యాలు వంటి పోషక పదార్థాలు కలిగి ఉన్నటువంటి ఎక్కువగా తీసుకోవాలన్నారు, గర్భిణీ దశ నుంచి శిశువుకు రెండేళ్లు వచ్చే వరకు శారీరక ఎదుగుదల చిన్నపిల్లలకు ఇంతగానో తోడ్పడుతుందన్నారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి కే నాయక్, ఉప సర్పంచ్ నీలం రెడ్డి, సెక్రెటరీ నాగరాజు, ఆశ వర్కర్ భాగ్యలక్షి , గ్రామ పాలకవర్గం సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలకు ప్రాధాన్యం..

- మైదానంలోనే పరిష్కార చర్చ
- బోరు నుంచి యూజీడీ వరకు..స్థానిక సమస్యలపై వారాల వినోద్ ఫోకస్
- ఎమ్మెల్యే, అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి)**

ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార మార్గాలను అన్వేషించే వేదికగా రామ్ లీలా మైదాన్ మరోసారి నిలిచింది. రామ్ లీలా మైదాన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వారాల వినోద్ కుమార్ స్థానికులతో ముఖాముఖి చర్చించి పలు మౌలిక వసతుల సమస్యలపై అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు మైదానంలో బోరు ఏర్పాటు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం, అయ్యప్ప గ్రౌండ్‌లో డ్రైనేజీ నీటి నిల్వ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలో లోపాలు, రేణుక ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. ఈ అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన వారాల వినోద్ కుమార్, ప్రతి సమస్యను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం తమ ప్రాధాన్యమని, సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. సమస్యలను గుర్తించడం మాత్రమే కాకుండా వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక కమిటీలు సమన్వయంతో ముందుకు సాగితేనే అభివృద్ధి వేగవంతమవుతుందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమంలో రామ్ లీలా మైదాన్ కమిటీ సభ్యులు రవి, రంగారావు, లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు రాజ్ కుమార్ ముదిరాజ్, కావలి రవి, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గాజులరామారంలో ఆక్రమణలపై ఉక్కుపాదం

- చౌరస్తా నుంచి మహాదేవపురం వరకు ఆక్రమణల తొలగింపు
- ఆక్రమిస్తే చర్యలు తప్పవు..ఉప కమిషనర్ హెచ్చరిక

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7: (నవజ్యోతి ప్రతినిధి):**

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం చౌరస్తా నుంచి మహాదేవపురం వరకు ఉన్న ప్రధాన రహదారిపై ప్రత్యేక ఆక్రమణల తొలగింపు డ్రైవ్‌ను అధికారులు నిర్వహించారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి అంతరాయం కలగకుండా రహదారిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణాలు, అనధికార అడ్డంకులను తొలగిస్తూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. భవిష్యత్తులో సర్కిల్ పరిధిలో ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు లేదా రహదారి ఆక్రమణలు గుర్తిస్తే సంబంధిత వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని గాజులరామారం ఉప కమిషనర్ యు. వెంకట్ రాములు స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఆర్. సుమిత్ర, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బి. సరిత సేన్ తమ సిబ్బందితో కలిసి పాల్గొని ఆక్రమణల తొలగింపు పనులను పర్యవేక్షించారు.




# తాత్కాలిక పరిష్కారం, శాశ్వతంపై ప్రశ్నలు!

- సూరారం డ్రైనేజీ సమస్యపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ బీ తక్షణ చర్యలు
- రెండు ప్రాంతాల్లో మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట
- శాశ్వత పరిష్కారానికి కొత్త యూజీడీ వ్యవస్థ కావాలి



**నవజ్యోతి ఎఫెక్ట్..**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7: (నవజ్యోతి ప్రతినిధి) :**

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువస్తున్న నవజ్యోతి దినపత్రిక కథనం మరోసారి అధికార యంత్రాంగాన్ని కదిలించింది. కొంపల్లి సర్కిల్ పరిధిలోని సాయిబాబానగర్ డివిజన్ సూరారం కాలనీలో నెలలుగా కొన సాగుతున్న డ్రైనేజీ సమస్యపై "మురుగు ప్రవాహంలో సూరారం... చూస్తూ ఊరుకుంటున్న వ్యవస్థ!" శీర్షికతో ప్రచురించిన కథనం వెలువడిన వెంటనే హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఓం జెండా మార్కెట్ ప్రధాన రహదారితో పాటు గార్డెన్ కేఫ్ సమీపంలోని గల్లీలో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తూ ప్రజలు, వ్యాపారులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం కథనంలో ప్రస్తావించడంతో అధికారులు వెంటనే స్పందించి రెండు ప్రాంతాల్లో డ్రైనేజీ అడ్డంకులను తొలగించి మురుగు నీటి ప్రవాహాన్ని సక్రమంగా మళ్లించారు. దీంతో స్థానికులు తాత్కాలిక ఉపశమనం పొందారు. ఈ సందర్భంగా స్థానికులు నవజ్యోతి ప్రచురించిన కథనం కారణంగానే అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి సమస్యను పరిష్కరించారని పేర్కొంటూ పత్రికకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల గొంతుకగా నిలిచి సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన మీడియా పాత్ర అభినందనీయమని వారు పేర్కొన్నారు.అయితే ప్రస్తుతం చేపట్టిన చర్యలు తాత్కాలిక పరిష్కారమేనని, సూరారం కాలనీ ఓం జెండా మార్కెట్ ప్రాంతంలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా కొత్త అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్ నిర్మించకపోతే ఇదే సమస్య మళ్లీ పునరావృతమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర ప్రణాళికతో ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరారు.

# ఆశ వర్కర్ల పై వేధింపులు ఆపాలి

**శివంపేట ఆగస్ట్ 7 (నవజ్యోతి ప్రతి నిధి ఆకుల శ్రీనివాస్)**



ఆశ వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్న సూపర్వైజర్ పై వెంటనే ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి – సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి. శివ్వంపేట మండల పరిధిలో పని చేస్తున్న ఆశా వర్కర్లను పి, హెచ్, సి లో స్టాఫ్ తక్కువగా ఉన్నారని నెపంతో ఆశా వర్కర్స్ విధులు కొనసాగించాలని ఉన్నతాధికారులు వేధింపులు గురి చేస్తున్నారని వాటిని వెంటనే ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. పండగ పూట కూడా విధులు కొనసాగించాలని లేనిపక్షంలో మెమోలు జారీ చేస్తామని కచ్చితంగా మీరు డ్యూటీ చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడం సరైన పద్ధతి కాదన్నారు.తోటి ఉద్యోగులు అన్ని చూడకుండా అసభ్య పదజాలాలతో దుర్భాషలాడుతున్నారన్నారు. పి హెచ్ సి లో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్స్ కి మంచినీటి సౌకర్యం తో పాటు మూత్రశాలలు ఏర్పాటు చేయాలని తోటి ఉద్యోగులు అన్ని చూడకుండా వేధింపులు గురి చేస్తున్న సూపర్వైజర్ మెడికల్ ఆఫీసర్ పై వెంటనే విచారణ చేపట్టి ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలని.పీ,హెచ్ సి అంబులెన్స్, 112 లేకున్నా ఆశా వర్కర్స్ గర్భిణీలను సొంత ఖర్చులతో హాస్పటల్ తీసుక వెళ్లిన సందర్భాలు ఉన్నవని ఈ సమస్యల పరిష్కారం దిశగా ఆలోచనలు చేయాలని లేనిపక్షంలో సిఐటియూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ తో పి. హెచ్ సి ముందు ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ కార్యదర్శి రేణుక, మాధవి, పద్మ,అనుసుజా, స్వప్న,నాగమణి, భూలక్షి , శిరీష వరమ్మ, రత్న ,సబిత, సాహిన తదితరులు పాల్గొన్నారు

# స్కూళ్ల ఫీజుల వివరాలు బహిర్గతం చేయాలి

### తెలంగాణ విద్యాశాఖ కీలక ఆదేశాలు

**హైదరాబాద్ ఆగస్టు 7 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి రాజగోపాల్)**

తెలంగాణలోని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల ఫీజుల నియంత్రణ, పారదర్శకతపై విద్యాశాఖ తీవ్ర నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్లు తమ ఫీజుల వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలంటూ విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం, ప్రతి పాఠశాల తమ ఫీజుల వివరాలను స్కూల్ నోటీస్ బోర్డుతో పాటు అధికారిక వెబ్‌సైట్‌లోనూ స్పష్టంగా డిస్ప్లే చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా, పాఠశాల విద్యాశాఖకు చెందిన పోర్టల్‌లో కూడా ఈ వివరాలను నమోదు చేయడం తప్పనిసరి అని స్పష్టం చేసింది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే షోకాజ్ నోటీసులు:**

విద్యాశాఖ జారీ చేసిన ఈ నిబంధనలను పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించే స్కూళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను (DEOs) ఆదేశించింది. ముఖ్యంగా రాబోయే 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజుల స్ట్రక్చర్‌ను ప్రదర్శించని పాఠశాలలను గుర్తించి, వాటిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు సూచించారు.



# 8.55 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం..

**అమీన్పూర్,ఆగష్టు 07(నవజ్యోతి ప్రతినిధి):**

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని..ప్రజా సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బీరంగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో రూ.8.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీల అవసరాలను



దృష్టిలో ఉంచుకుని రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయి స్తున్నామని తెలిపారు. ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుంటూ అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఘన స్వాగతం పలికారు.

# జనసేనతో సహా ఏ పార్టీతోనూ పొత్తు ఉండదు: బీజేపీ స్పష్టీకరణ

**హైదరాబాద్ ఆగస్టు 7 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి రాజగోపాల్) :**



తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (BJP) ఒంటరిగానే బరిలోకి దిగుతుందని ఆ పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. జనసేనతో సహా మరే ఇతర రాజకీయ పార్టీతోనూ తమకు ఎలాంటి పొత్తులు ఉండవని ఆయన తేల్చి చెప్పారు. ముఖ్యంగా రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) ఎన్నికల్లో బీజేపీ సింగిల్‌గానే పోటీ చేస్తుందని ఆయన ప్రకటించారు. అంతేకాకుండా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర పార్టీ నేతల మధ్య కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని, అంతకుమించి మరేమీ లేదని ఆయన పేర్కొన్నారు. అయితే, జాతీయ స్థాయిలో జనసేన పార్టీ ఇప్పటికే ఎన్డీయే (NDA) కూటమిలో భాగస్వామిగా ఉన్న నేపథ్యంలో, రాష్ట్రంలో రామచందర్ రావు ఒంటరి పోటీ గురించి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# అమ్మవారి చల్లని దీవెనలు అందరి పైన ఉండాలి.

### సర్పంచ్ నాయికోటి లావణ్య మధు.

**సదాశివపేట. ఆగస్టు 7. (నవజ్యోతిప్రతినిధి) :**

సదాశివపేట మండలంలోని ఆరూరు గ్రామంలో మైసమ్మ జాతర ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ జాతరలో గ్రామంలోని ప్రతి ఒక్కరూ పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ నాయికోటి లావణ్య మధు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో కలిగి ఉండాలని, అమ్మవారి దయవల్ల సమయానికి వర్షాలు కురిసి పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండాలని కోరుకోవడం జరిగిందన్నారు. మైసమ్మ తల్లి జాతర కనుల పండుగ అంగరంగ వైభవంగా జరిగిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఒగ్గు రాఘవేందర్ స్వామి పోతురాజు, శివశక్తులు విన్యాసాలతో అందర్నీ ఆకర్షించుకోవడం జరిగింది. జాతర చూడముచ్చట జరిగిందని గ్రామ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విట్టల్, వార్డు మెంబర్లు నాగేష్, భరత్, రమేష్, అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్, మాజీ



ఎంపిటిసి శివకుమార్, లలిత, గ్రామ పెద్దలు రాఘవేందర్, బాలయ్య, లక్ష్మణ్ గౌడ్, డాక్టర్ రాజకుమార్, సంగమేశ్వర్, నర్సింలు, కృష్ణ, రమేష్, మానయ్య, నారాయణ గౌడ్లా మంలోని పెద్దలు యువకులు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాజాన్ని మెరుగుపరిచే పరిశోధనల వైపు దృష్టి సారించాలి...

- **వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్. సిహెచ్.వి. పురుషోత్తం రెడ్డి.**

**ఉమ్మడి రంగారెడ్డి/ మొయినాబాద్, ఆగస్టు 07,(నవజ్యోతి ప్రతినిధి) :**

మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ, బయోటెక్నాలజీ విభాగానికి చెందిన జయంతి పోతిరెడ్డి పిహెచ్.డీ. (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) డిగ్రీని సాధించారు."సాయిల్ మైక్రోబ్స్ అస్ సోర్స్ అఫ్ పిగ్మెంట్స్: ఏ స్టడీ ఆన్ థేయిర్ బయోమెడికల్ అప్లికేషన్స్ అండ్ ఇన్ సిలికో ఇంట్రాక్షన్స్ " అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు గాను ఈ డిగ్రీ లభించింది. ఈ



పరిశోధన డాక్టర్ వి. శ్రీలేఖ పర్యవేక్షణలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు & ఛాన్సలర్ డాక్టర్. సిహెచ్, వి. పురుషోత్తం రెడ్డి ఇట్టి డిగ్రీని అధికారికంగా ప్రధానం చేశారు. అయన మాట్లాడుతూ జీవ సాంకేతిక శాస్త్రం జరుగుతున్న పరిశోధనలు దేశాభివృద్ధికి కీలకంగా మారుతున్నాయని, వర్ణద్రవ్యాల మూలంగా మట్టి సూక్ష్మజీవులు, వాటి జీవవైద్య అనువర్తనాలు, ఇన్ సిలికో పరస్పర చర్యలపై ఒక అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేయడం చాల శుభపరిణామం అని, జీవ సాంకేతిక శాస్త్రం విభాగానికి గర్వకారణమని, శాస్త్రీయ అవగాహనతో పాటు సమాజ శ్రేయస్సును పెంపొందించే పరిశోధనలకు విశ్వవిద్యాలయం నిరంతరం ప్రోత్సాహం ఇస్తుందని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సాత్విక రెడ్డి, వైస్ ఛాన్సలర్ ఆచార్య జి. శంకర్ లింగం, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. రవీందర్, డీన్ (పరిశోధన & అభివృద్ధి) ఆచార్య క్రిస్టోఫర్, డీన్ (పరిపాలన) ఆచార్య ఎ. రాజు, పరీక్షల కంట్రోలర్ ఆచార్య బి. రాజేందర్ రెడ్డి, డిప్యూటీ కంట్రోలర్ ఆచార్య ఈ. జగదీశ్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ & పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఫీనిక్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు..



- **సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు**
- **అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**రాజేంద్రనగర్ ఆగస్టు 07 (నవజ్యోతి ప్రతినిధి )**

హైదర్ షాకోట్ డివిజన్ గంధం గూడ ప్రాంతంలోని ఫీనిక్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో బోనాల పండుగను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల సంప్రదాయ దుస్తులు ధరించి బోనాల ఊరేగింపులో పాల్గొని సందడి చేస్తూ పండుగ వైభవాన్ని ప్రతిబింబించారు. పాఠశాల కరస్పాండెంట్ సురేష్ చారి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని అన్నారు. ప్రిన్సిపాల్ వరలక్ష్మి విద్యార్థులకు బోనాల పండుగ విశిష్టతను వివరించి, మన సంస్కృతిని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూపరాణి, పల్లవి, సునీత, విజయనిర్మల, రాజ్యలక్ష్మి , భావన, ఇందు, బిందు, ప్రణతి పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు.

# పేటలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

- **ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలి.**
- **నూతన అధ్యక్షులు చింత గోపాల్.**

సదాశివపేట. ఆగస్టు 7. (నవజ్యోతి ప్రతినిధి)

సదాశివపేట పట్టణంలోని చేనేత సహకార సంఘ భవనంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంగారెడ్డి ఎమ్మెల్యే తనయుడు చింత సాయినాథ్, విశిష్ట అతిథులు సంగారెడ్డి పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కొప్పర వెంకట హరికిషన్ పాల్గొన్నారు. ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వందేమాతరం గీతంతో వేడుకలు కొనసాగాయి. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘం అధ్యక్షులు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం గౌరవ అధ్యక్షులు అంబటి విశ్వనాథం ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన అధ్యక్షులు చింత గోపాల్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత సహకారం అందించాలని కోరారు. చేనేత రంగం అభివృద్ధికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నేతన్నలకు మిత్తిలేని ఋణాలను అందించాలన్నారు. అవసరమైన చోట్ల చేనేత కార్మికులకు శిక్షణ శిభిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వమే ముడి సరుకును సబ్సిడీ రూపంలో



అందించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. చివరగా చేనేత కార్మికులను చేనేత వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు చింత ఆనంద్, మేనేజర్ చిల్వేరి వెంకటేశం, డైరెక్టర్లు వెంకటాపురం వెంకటేశం, గడీల ప్రభాకర్, గోనె శంకర్, మునిపల్లి రమేష్, చిలువెరి రచన, కర్నాటి రుకుంబాయి, నాలుగు కులదై వాల అధ్యక్షులు చిల్వేరి రవి, మునిపల్లి రామ క్రిష్ణ, గుజ్జరి ఆంజనేయులు, మెరుగు శంకర్ పద్మశాలి కౌన్సిలర్లు న్యాలం అర్జున్ ఫణి క్రిష్ణ, నాగుల విజయ్, బిట్ల నిఖిత ప్రేమ్, పద్మశాలి సంఘం నాయకులు రుమాండ్ల రాజు, ఎ. మనోహర్, గున్నాల సత్యం, కొంగరి ప్రభు, శ్రీనివాస్, సురేష్ డాక్యుమెంట్ రైటర్, అడ్డగట్ల శంకర్, జనార్ధన్, సోమశంకర్ చేనేత కార్మికులు, కులబాంధవులు పాల్గొన్నారు.

# అంజిరెడ్డిని సన్మానించిన తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం



**మేడ్చల్, ఆగష్టు 07(నవజ్యోతి ప్రతినిధి ) :**

మేడ్చల్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్ స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన అంజిరెడ్డిని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన సీఐకి శుభాకాంక్షలు తెలియజేస్తూ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డబ్లిపురం రాములు, జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య, బీసీ మైనారిటీ విభాగం మండల అధ్యక్షురాలు హసీనా బేగం, జిల్లా సెక్రెటరీ నన్నేమియా, సోమవారం విలేజ్ ప్రెసిడెంట్ రాజు, బద్రి తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడి నిర్లక్ష్యం

- **గర్భిణీ ప్రాణాలతో చెలగాటం!**
- **ప్రభుత్వ ఆసుపత్రిలో భయం.. ప్రైవేట్‌లో నార్మల్ డెలివరీ: బట్టబయలైన డాక్టర్ నిర్లక్ష్యం**
- **వైద్యుడి ప్రైవేట్ ప్రాక్టీస్ దందాపై సమగ్ర విచారణ జరపాలి: సి.ఐ.టి.యు డిమాండ్**
- **డాక్టర్ సత్యకుమార్ నిర్లక్ష్యంపై సి.ఐ.టి.యు నిప్పులు!**
- **ముమ్మిడివరం సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నిధులు కేటాయించాలి: జి.దుర్గాప్రసాద్**

**ముమ్మిడివరం, ఆగష్టు 07 (నవ జ్యోతి ప్రతినిధి రెడ్డి వీరబాబు ):**

ముమ్మిడివరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో (సి.హెచ్.సి) గైనకాలజిస్ట్ డాక్టర్ జి.వి.వి.ఎస్. సత్యకుమార్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ గర్భిణీల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని సి.ఐ.టి.యు జిల్లా అధ్యక్షులు జి. దుర్గాప్రసాద్ తీవ్రంగా మండిపడ్డారు. అనాతవరం గ్రామ పంచాయతీకి చెందిన సకిలే విమల అనే గర్భిణీని ప్రసవం కోసం ఆగస్టు 3న చేర్పించగా, మరుసటి రోజు ఉదయం ఆపరేషన్ పేరిట థియేటర్‌కు తరలించి, నాలుగు గంటల పాటు కుటుంబ సభ్యులను ఉత్కంఠకు గురిచేసి చివరకు సర్జరీ చేయలేనని సదరు డాక్టర్ చేతులెత్తేసారు. పైగా తల్లి లేదా బిడ్డలలో ఒకరు మాత్రమే బతికే అవకాశముందని భయపెడుతూ, కాకినాడకు రెఫర్ చేసి, అంబులెన్స్ సిద్ధమయ్యాక మళ్లీ మాట మార్చి తానే సర్జరీ చేస్తానంటూ తీవ్ర గందరగోళాన్ని సృష్టించారు. వైద్యుడి ప్రవర్తనపై నమ్మకం కోల్పోయిన కుటుంబ సభ్యులు ప్రాణభయంతో విమలను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా,



అక్కడ ఎలాంటి సర్జరీ లేకుండానే సురక్షితంగా నార్మల్ డెలివరీ అయి ప్రస్తుతం తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగా ఉన్నారు. ఈ ఘటనతో డాక్టర్ సత్యకుమార్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ, కొండలమ్మ చింత వద్ద తాను ప్రాక్టీస్ చేసే 'సావిత్రి హాస్పిటల్'కు తరలించి అక్కడ ఆపరేషన్ల దందా సాగిస్తున్నారనే నగ్నసత్యం బట్టబయలైంది. ఈ నేపథ్యంలో, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు వెంటనే స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తగిన నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని, అలాగే విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ ప్రైవేట్ లాభాల కోసం పేదల ప్రాణాలను పణంగా పెడుతున్న డాక్టర్ సత్యకుమార్‌పై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సి.ఐ.టి.యు డిమాండ్ చేస్తోంది. ఈ కార్యక్రమంలో విమల కుటుంబ సభ్యులు ఆశ ,దొరబాబు ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ , పాము బాలయ్య, ఇసుకపట్ల మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

## గుబ్బ కోల్డ్ స్టోరేజ్ లో విద్యుత్ షాక్ తో కార్మికుడు మృతి..

### యాజమాన్యం తీరుపై ఆందోళన



**మేడ్చల్, ఆగష్టు 07(నవజ్యోతి ప్రతినిధి )**

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లంపేట గుబ్బ కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన ప్రమాదంలో బెస్త నాగరాజు (28) అనే కార్మికుడు విద్యుత్ షాక్‌తో దుర్మరణం చెందాడు. కోల్డ్ స్టోరేజ్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో, కంపెనీ సిబ్బంది స్థానిక లైన్‌మెన్ ఆచార్యా చారికి సమాచారం అందించారు. అతను అందుబాటులో లేకపోవడంతో కింది స్థాయి కార్మికుడైన నాగరాజును పంపించారు. నాగరాజు ఫ్యూజ్ వేస్తున్న సమయంలో ఆటోమేటిక్‌గా జనరేటర్ ఆన్ కావడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలాడు. తోటి కార్మికులు వెంటనే అతన్ని మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఇంతటి ఘోర ప్రమాదం జరిగినా కంపెనీ యాజమాన్యం స్పందించకపోవడంతో, మృతుడి బంధువులు కోల్డ్ స్టోరేజ్ ముందు ఆందోళనకు దిగారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## పల్లవి కిడ్జ్ స్కూల్ లో ఘనంగా బోనాల సంబరాలు...

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా చిన్నారుల అద్భుత ప్రదర్శనలు.




**ఉమ్మడి రంగారెడ్డి/ చేవెళ్ల, ఆగస్టు 07, (నవజ్యోతి ప్రతినిధి) :**

చేవెళ్ల ప్రాంతంలోని పల్లవి కిడ్జ్ స్కూల్ ప్రాంగణం బోనాల పండుగ సంబరాలతో కళకళలాడింది. తెలంగాణ ఆత్మీయత, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకల్లో చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ, పోతురాజుల వేషధారణలో చేసిన ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పండుగకు సంబంధించిన ఆచారాలు, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలతో స్కూల్ ఆవరణ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని అన్నారు. బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, భక్తి సంప్రదాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. చిన్నారులు చిన్న వయస్సు నుంచే మన సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించుకునేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అవసరమని ఆయన తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ బరిరా ఖాతూన్, డైరెక్టర్లు మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించేందుకు విద్యతో పాటు ఇటువంటి పండుగల నిర్వహణకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ–విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, పోతురాజుల నృత్యాలు, బోనాల అలంకరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. పల్లవి కిడ్జ్ స్కూల్‌లో నిర్వహించిన ఈ బోనాల వేడుకలు తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా ఘనంగా జరిగాయి.

## రామాయంపేట లో ముగ్గురు విద్యార్థులు అదృశ్యం.. గాలింపు ముమ్మరం.

- కేఎస్ఆర్ కాలనీలో కలకలం.. ముగ్గురు బాలురు కనిపించక కేసు నమోదు
- సీఐ బి.సైదానాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక గాలింపు



**రామాయంపేట ఆగస్టు7 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**

రామాయంపేటలో ముగ్గురు విద్యార్థులు అదృశ్యం.. సీఐ బి. సైదా నాయక్ ఆధ్వర్యంలో గాలింపు ముమ్మరం రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీకి చెందిన మెక్కొండ అశ్విని అలియాస్ సోనీ, భర్త వెంకటేష్ (30) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు విద్యార్థులు అదృశ్యమైన ఘటనపై రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల వివరాల ప్రకారం.. మెక్కొండ అశ్విని కుమారుడు ధనుష్ (13) ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అదే కాలనీకి చెందిన ఆరె గీత కుమారుడు మనోజ్ (13) 8వ తరగతి, రూబీన కుమారుడు షేక్ సమీర్ (13) 9వ తరగతి చదువుతున్నారు. ఆగస్టు 6వ తేదీ రాత్రి సుమారు 9 గంటల వరకు కేఎస్ఆర్ కాలనీలో కలిసి ఆడుకున్న అనంతరం ముగ్గురు బాలురు ఇంటికి వెళ్లకుండా ఎవరికి చెప్పకుండా కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.ఫిర్యాదు ఆధారంగా రామాయంపేట ఎస్ఐ బలరాజ్ కేసు నమోదు చేశారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సైదా నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలల కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. సీసీటీవీ దృశ్యాల పరిశీలనతో పాటు వివిధ ప్రాంతాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ముగ్గురు బాలల ఆచూకీ తెలిసిన వారు వెంటనే రామాయంపేట పోలీస్ స్టేషన్, ఎస్ఐ బలరాజ్ లేదా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సైదా నాయక్‌కు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## 23న వైభవంగా సత్ర భవనం అదనపు గదుల ప్రారంభోత్సవం

- శంభిపూర్ రాజుకు ఆహ్వానం..ప్రారంభోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు
- సేవే లక్ష్యంగా..మున్నూరు కాపుల మరో ముందడుగు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**

వేములవాడలో మున్నూరు కాపు సమాజ సేవా కార్యక్రమాలకు కేంద్రంగా నిలిచిన శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్ర భవనంలో నిర్మించిన అదనపు గదుల ప్రారంభోత్సవం ఈ నెల 23వ తేదీన వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు పటేల్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసేందుకు సంఘం ప్రతినిధులు బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజును కలిసి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ, నిత్యాన్నదాన సత్రానికి వచ్చే భక్తులు, యాత్రికులకు మరింత మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో అదనపు గదుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవం మున్నూరు కాపు సమాజ ఐక్యతకు, సేవా భావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బూరుగు లక్ష్మీనారాయణ, బురుగుబాబు సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా యూత్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సాయిని శ్రీనివాస్తో పాటు పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఖరీదైన కలప మాయమైందన్న ప్రచారం అవాస్తవం

### ఎక్సైజ్ అధికారుల వివరణ..

**ఆగస్టు 7 | ముమ్మిడివరం (నవ జ్యోతి ప్రతినిధి రెడ్డి వీరబాబు) :**



అమలాపురంలోని ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో ఉన్న పాత సాల్ట్ డిపార్ట్ మెంట్ భవనం కూల్చివేతకు సంబంధించి ప్రచారంలో ఉన్న ఆరోపణలను ఎక్సైజ్ అధికారులు ఖండించారు. చెట్టు పడటంతో భవనం వెనుక భాగం దెబ్బతినడంతో, ఆర్ అండ్ బి మరియు ఎక్సైజ్ ఉన్నతాధికారుల అనుమతితో భవనం శిథిలాలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. భవనం నుంచి వెలికితీసిన కలప మొత్తం భద్రంగా ఉంచామని, ఖరీదైన బర్మా టేకు కలపను అక్రమంగా తరలించారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఎక్సైజ్ కార్యాలయం సమీపంలోని పాత సాల్ట్ డిపార్ట్ మెంట్ భవనం ప్రభుత్వ ఆస్తేనని, దానిని ఎవరూ కబ్జా చేయలేదని పేర్కొన్నారు. సంబంధిత ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆ స్థలాన్ని ఎక్సైజ్ శాఖకు అప్పగించారని, స్థలం ఎక్కడికీ పోలేదని వివరించారు. టెండర్లు లేకుండానే భవనాన్ని కూల్చివేసి రూ.50 లక్షల విలువైన బర్మా టేకు కలపను అక్రమంగా తరలించారన్న ప్రచారం పూర్తిగా నిరాధారమని అధికారులు తెలిపారు. ఆ భవనంలో ఉన్న కలప పరిమాణాన్ని లెక్కల ద్వారా నిర్ధారించవచ్చని, అక్కడి నుంచి తీసిన కలపను భద్రంగా భద్రపరిచినట్లు చెప్పారు. భారీ యంత్రాలతో మూడు రోజుల పాటు కూల్చివేత పనులు నిర్వహించి లక్షల రూపాయలు ఖర్చు చేశారన్న వార్తల్లోనూ ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నారు. శిథిలాలను తొలగించేందుకు కేవలం రూ.35 వేల మాత్రమే వ్యయం అయ్యిందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తి దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలు నిరాధారమని, ప్రజల్లో అపోహలు సృష్టించేలా అసత్య ప్రచారాలు చేయవద్దని ఎక్సైజ్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## చర్లపల్లి చెరువు సుందరీకరణ పనులకు వేగం

- అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి – నాణ్యతలో రాజీ వద్దని అధికారులకు ఆదేశం



**చర్లపల్లి, ఆగస్టు 7, (నవజ్యోతి ప్రతినిధి):**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లి చెరువు వద్ద కొనసాగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. చెరువు పరిసర ప్రాంతాలను సందర్శించిన ఆయన, జరుగుతున్న పనుల పురోగతి, నాణ్యతపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా చెరువును అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. చెరువు పరిసరాల్లో పచ్చదనం పెంపు, వాకింగ్ ట్రాక్, ఆధునిక లైటింగ్, పరిశుభ్రత, విశ్రాంతి కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించేలా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత చర్లపల్లి చెరువు స్థానిక ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణంతో పాటు కుటుంబ సభ్యులతో గడిపేందుకు అనువైన విహార కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా చెరువుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో “సహచరి” కార్యక్రమం నిర్వహణ

**కుషాయిగూడ, ఆగస్టు 07,(నవజ్యోతి ప్రతినిధి) :**




మహిళల భద్రత, రక్షణ మరియు సాధికారతపై అవగాహన కల్పించే లక్ష్యంతో పోలీస్ కమిషనర్ గారి మార్గదర్శకత్వంలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో “సహచరి” కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సి డి డబ్ల్యూ సహకారంతో హెచ్‌బీ కాలనీలోని రాజీవ్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద సుమారు 50 మంది స్వయం సహాయక సంఘం ( ఎస్ హెచ్ ఓ) మహిళా సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం మహిళా సభ్యులు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు ఎన్. వెంకన్న, ఎన్. సుధాకర్ రెడ్డి పోలీస్ స్టేషన్ పనితీరు, మహిళల ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార విధానం, మహిళలకు సంబంధించిన కేసుల దర్యాప్తు ప్రక్రియపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు, మహిళా హెల్ప్‌లైన్ సేవలు, అత్యవసర సహాయం, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ సేవల గురించి వివరించారు. మహిళలు తమ సమస్యలను ఎలాంటి భయాందోళనలు లేకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సమయంలో పోలీస్ శాఖ అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆవరణలో మహిళా సభ్యుల చేత మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జరిగిన ప్రశ్నోత్తర సమావేశంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మహిళల భద్రత, సంక్షేమం కోసం పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను మహిళా సభ్యులు అభినందిస్తూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని కోరారు.

## కుషాయిగూడలో మహిళ అదృశ్యం

- కుట్టు సామగ్రి కొనుగోలుకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు



**కుషాయిగూడ, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్ ఎన్‌క్లేవ్, కాప్రా ప్రాంతానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. అశోక్ ఎన్‌క్లేవ్‌కు చెందిన నాగరం సిర్వి (43) తన భార్య సంతోష్ సిర్వి (34) కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో కుట్టు సామగ్రి కొనుగోలు చేసేందుకు మ్యాచింగ్ సెంటర్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన సంతోష్ సిర్వి, రాత్రి 8 గంటల వరకు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె మొబైల్ ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో పాటు, బంధువులు, పరిచయస్తులు మరియు ఇతర ప్రాంతాల్లో గాలించినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో భర్త నాగరం సిర్వి కుషాయిగూడ పోలీసులను ఆశ్రయించారు.అదృశ్యమైన సంతోష్ సిర్వి సుమారు 5 అడుగుల ఎత్తు, తెల్లటి ఛాయ కలిగి ఉండి, చివరిసారిగా చీర ధరించి ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి, అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. ఆమె గురించి సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా కుషాయిగూడ పోలీసులను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# నాగారంలో యూటర్న్‌ల మూసివేతతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

- **శిల్పా రోడ్డు–రాఘవేంద్ర హోటల్ జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసి యూటర్న్ పునరుద్ధరించాలి: తెలంగాణ రాజ్యాధికార పార్టీ**



**నాగారం, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**

ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని శిల్పా రోడ్డు–రాఘవేంద్ర హోటల్–కల్లు కంపౌండ్ సమీపంలోని యూటర్న్‌ను మూసివేయడంతో ప్రతిరోజూ వేలాది మంది వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యపై పార్టీ నాయకులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ, ఈ మార్గంలో సిరినీటి స్కూల్, సెయింట్ మార్టిన్ స్కూల్, నారాయణ విద్యాసంస్థలతో పాటు అనేక విద్యాసంస్థలు ఉండటంతో ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ రహదారిని వినియోగిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా సింహపురి కాలనీ, లక్ష్మీనగర్, టీచర్స్ కాలనీ, రామలింగేశ్వర కాలనీ, వెంకటేశ్వర కాలనీ, సాయి సిద్ధార్థ నగర్, తారాపురి కాలనీ, మదన నగర్, కృష్ణ థియేటర్ నగర్, దమ్మాయిగూడ తదితర ప్రాంతాల ప్రజల రాకపోకలకు ఈ రహదారి ప్రధాన మార్గంగా ఉందన్నారు. యూటర్న్ మూసివేతతో వాహనదారులు దాదాపు అర కిలోమీటర్ వరకు రాంగ్ రూట్‌లో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల ట్రాఫిక్ రద్దీ పెరగడమే కాకుండా ప్రమాదాల ముప్పు కూడా అధికమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టయోటా షోరూం సమీపంలోని యూటర్న్ సమస్య కారణంగా నేషనల్ మార్ట్ వైపు నుంచి వచ్చే వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై స్థానిక ప్రజలు ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా "అన్నా... మా కోసం పోరాడండి... యూటర్న్ తెరిపించండి" అంటూ తమను సంప్రదిస్తున్నారని పార్టీ నాయకులు తెలిపారు. ప్రజల ప్రాణ భద్రత, విద్యార్థుల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణను దృష్టిలో ఉంచుకుని శిల్పా రోడ్డు–రాఘవేంద్ర హోటల్ జంక్షన్‌లో వెంటనే ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసి, యూటర్న్‌ను పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ చర్యలతో రాంగ్ రూట్ ప్రయాణాలు తగ్గి, ప్రమాదాలు నివారించబడటంతో పాటు ప్రజలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జాయింట్ సెక్రటరీ గంద్ర కమలాకర్ పటేల్, పార్టీ యువ నాయకుడు సాయి కిరణ్ పాల్గొని సమస్యను పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# వికాస్ నగర్ కాలనీ అభివృద్ధికి మరో ముందడుగు

- **దాతల సహకారంతో కమిటీ హాల్ అభివృద్ధి – పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు**

**నాగారం, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**



ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని వికాస్ నగర్ కాలనీ కమిటీ హాల్ అభివృద్ధి పనులు దాతల సహకారం, కాలనీ అసోసియేషన్ సభ్యుల భాగస్వామ్యంతో విజయవంతంగా చేపట్టారు. కాలనీవాసుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కమిటీ హాల్‌ను మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దే దిశగా పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కమిటీ హాల్‌కు కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టడంతో పాటు, మున్సిపల్ అధికారుల సహకారంతో జేసీబీ ద్వారా పరిసరాలను పూర్తిగా శుభ్రం చేశారు. హాల్ పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించి, మోరం వేసి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దారు.ఈ అభివృద్ధి కార్యక్రమం నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి మరియు వికాస్ నగర్ కాలనీ అధ్యక్షుడు సుర్వి గిరి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, దాతల సహకారం, కాలనీవాసుల ఐక్యతతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కమిటీ హాల్‌ను కాలనీవాసులకు మరింత ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.అభివృద్ధి కార్యక్రమానికి సహకరించిన దాతలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు మరియు కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కాలనీ అధ్యక్షుడు సుర్వి గిరి గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, కే. రవి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జానకినగర్ లో పర్యటించిన-మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి

**అల్వాల్/ఆగస్టు 7, (నవజ్యోతి ప్రతినిధి):**

అల్వాల్ డివిజన్ జానకినగర్ కాలనీ లో పలు సమస్యలపై నాయకులతో కలిసి మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు.ఈ పర్యటన సందర్భంగా ఆమె ఆ ప్రాంతంలోని వివిధ ప్రజా సమస్యలను నివాసితులతో సంభాషించారు.డ్రైనేజీ (మురుగునీటి) సమస్య,యోగా చేసే స్థలంలో టైల్స్ వేయడం,పారిశుద్ధ్య సంబంధిత సమస్యలు, పరిష్కరించాలని కాలనీవాసులు శాంతి శ్రీనివాస్ రెడ్డిని కోరడం జరిగింది.ఆమె మాట్లాడుతూ ఈ సమస్యలను త్వరగా శాశ్వత పరిష్కారం దిశగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అరుణ్, ప్రశాంత్,లింగారెడ్డి సాజిద్,తదితరులు పాల్గొన్నారు.



# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు

- **ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాగారం మాజీ చైర్మన్ చంద్ర రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్**

**నాగారం, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**



ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్–5 పరిధిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఆషాఢ మాస బోనాల పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, మెరుగు శ్రీనివాస్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చిన్నారులకు పరిచయం చేసే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని అన్నారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడంలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.స్కూల్ యాజమాన్యాన్ని అభినందించిన వారు, భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని బోనాల వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

# దోమల నివారణే లక్ష్యం..

- **జవహర్ నగర్‌లో 'ఫ్రైడే–డ్రైడే' విస్తృత అవగాహన కార్యక్రమం**
- **డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం – ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన**

**జవహర్ నగర్, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి):**




మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం ఆధ్వర్యంలో జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని వైయస్సార్ నగర్‌లో ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ఫ్రైడే–డ్రైడే' దోమల నివారణ అవగాహన కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు.

కార్యక్రమంలో భాగంగా ఎంటమాలజీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే పాత్రలు, కూలర్లు, టైర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, వ్యర్థ వస్తువులు తదితర ప్రాంతాలను పరిశీలించి, దోమల వృద్ధికి అనుకూలంగా ఉండే నిల్వ నీటిని వెంటనే తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే–డ్రైడే' కార్యక్రమంలో భాగంగా నీరు నిల్వ ఉండే పాత్రలను ఖాళీ చేసి శుభ్రపరిస్తే దోమల వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చని అధికారులు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమకాటు వ్యాధులను పూర్తిగా నియంత్రించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో "దోమ పుట్టకుండా – దోమ కుట్టకుండా" అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తమ ఇళ్లలో, పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, కుటుంబ సభ్యులకు కూడా దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం మాట్లాడుతూ, వర్షాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని అన్నారు. ప్రజలు మున్సిపల్ అధికారులతో సహకరించి దోమల నివారణ చర్యల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఈ భాస్కర్, తిరుపతి రాజ్, వార్డు ఎంటమాలజీ సూపర్వైజర్లు శ్రీనివాస్, స్వామి, కాలనీ సభ్యులు, ఎంటమాలజీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేరూరు రైతు వేదికను సందర్శించిన సర్పంచ్ గొడ్డె సరోజినీ దేవి .



**వాజేడు, (నవజ్యోతి ప్రతినిధి) :**

వాజేడు మండల పరిధిలోని పేరూరు గ్రామ పంచాయతీలోని రైతు వేదికను సర్పంచ్ గొడ్డె సరోజినీ దేవి మరియు వార్డు మెంబర్ శరత్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతు వేదికలో బట్టలు కుట్టు మిషన్ ట్రైనింగ్ తీసుకుంటున్న మహిళలతో వారు మాట్లాడారు. వారి శిక్షణ అను భవాలు, ఎదురవుతున్న ఇబ్బం దులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఈఓ ను కలిసి రైతు వేదిక పనితీరు, రైతులకు అందిస్తున్న సేవలపై చర్చించారు. రైతు వేదికలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ గొడ్డె సరోజినీ దేవి కోరారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గ్రామస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతు వేదికల ద్వారా రైతులకు వ్యవసాయ సమాచారం, ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటల విక్రయం వంటి సేవలు ఒకే చోట అందుబాటులో ఉంటాయని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాస్ రెడ్డిపై అత్యాచార కేసు నమోదు

**బాధితురాలి ఫిర్యాదుతో అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు**

**అమీన్ పూర్, ఆగస్టు 7(నవజ్యోతి ప్రతినిధి):**



సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డిపై అత్యాచారం, లైంగిక వేధింపులు, బెదిరింపులు తదితర ఆరోపణలతో కేసు నమోదైంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బీరంగూడ జయలక్ష్మి నగర్‌కు చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, గతంలో కుటుంబ తగాదా విషయంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో విధుల్లో ఉన్న ఇన్‌స్పెక్టర్ తనకు న్యాయం చేస్తానని నమ్మబలికి, తన సమ్మతి లేకుండా లైంగికంగా వేధించాడని ఆరోపించింది. ఆ ఘటన ఫలితంగా తాను గర్భం దాల్చగా, అనంతరం బలవంతంగా గర్భస్రావం చేయించాడని, అలాగే తాను పిలిచినప్పుడల్లా రావాలని బెదిరించడంతో పాటు దాడి చేసి గాయపరిచాడని, తన వద్ద నుంచి డబ్బులు కూడా తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 64, 68, 74, 75, 77, 78, 89, 115, 308,351తో పాటు సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్లు 66(E), 67, 67(A) కింద అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి, దర్యాప్తులో లభించే సాక్ష్యాధారాల ఆధారంగా చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. కాగా, ఇదే అధికారిపై గతంలో లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో అప్పటి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సస్పెన్షన్ విధించిన విషయం తెలిసిందే.

# కుంగిన రోడ్డుకు తక్షణ మరమ్మతులు చేపట్టాలి: పండాల సతీష్ గౌడ్

**కూకట్ పల్లి, ఆగస్టు 7, (నవజ్యోతి ప్రతినిధి):**

ఫతేనగర్ డివిజన్ శోభనా కాలనీ – జవహర్ నగర్ మధ్య ఉన్న బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా కుంగిన రోడ్డును మున్సిపల్ ఏఈ వరుణ్ దేవ్ తో కలిసి మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పరిశీలించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రమాదాలు జరగకుండా వెంటనే బారికేడ్లు ఏర్పాటు చేయించారు. తాత్కాలికంగా వెట్ మిక్స్ వేసి రోడ్డు కుంగకుండా చర్యలు తీసుకుంటామని, త్వరలోనే నూతన కల్వర్టు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేస్తామని వెల్లడించారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో నాయకులు కంచి భిక్షపతి, కుక్కల రాము, ముదిరాజ్ శేఖర్, గట్ల సురేందర్, నాయుడు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి: అరెకపూడి గాంధీ



**కూకట్ పల్లి, ఆగస్టు 7, (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతామని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాది అని, నాణ్యమైన విద్యనందించేందుకు విద్యా రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో తరగతి గదులు నిర్మించిన సీఎస్ఆర్ ప్రతినిధులను అభినందించారు. ప్రభుత్వ బడుల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఎంఈఓ రవీందర్ రాజు, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఫౌండేషన్ ప్రతినిధి నాగలక్ష్మి , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముమ్మిడివరం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో అనధికార నిర్మాణాలు..?

- పాత పెట్రోల్ బంక్ వద్ద యథేచ్ఛగా లేఅవుట్లు, రేకుషెడ్లు – టౌన్ ప్లానింగ్ సిబ్బంది, కమిషనర్ పై స్థానికుల ఆరోపణలు...



**ఆగస్టు 7, ముమ్మిడివరం (నవజ్యోతి ప్రతినిధి):**

ముమ్మిడివరం ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతంలోని పాత పెట్రోల్ బంక్ సమీపంలో అనధికార లేఅవుట్లు, రేకుషెడ్ల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది, నగర పంచాయతీ కమిషనర్ చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, కమిషనర్‌కు ఆర్థిక ప్రయోజనం (చేతివాటా) ఉందని కొందరు స్థానికులు ఆరోపిస్తూ, ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## మాతా-శిశు ఆరోగ్యానికి తల్లి పాలే తొలి రక్షణ: సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి.

- గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం
- పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన తల్లి-బిడ్డ: అంగన్వాడీ సిబ్బంది
- తల్లి పాలపై అవగాహన – పౌష్టికాహారంపై సూచనలు

**రామాయంపేట,ఆగస్టు 7 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ )**



రామాయంపేట మండలంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి మాట్లాడుతూ, పుట్టిన శిశువుకు తొలి ఆరు నెలలు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని, తల్లి ఆరోగ్యం కోసం సమతుల్య పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణి మహిళలకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించి ఆశీర్వదించారు.చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లి, శిశు సంక్షేమానికి సంబంధించిన పలు ఆరోగ్య సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బండారు రాణి, అనూష, ఆశా వర్కర్ శారదా, గర్భిణి మహిళలు, బాలింతలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి:

### యు ఎస్ పి సి పిలుపుతో జడ్పీహెచ్ఎస్ లో నల్ల బ్యాడ్జీలతో నిరసన

**నడిగూడెం, ఆగస్టు 7 ( నవ జ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్ ):**

ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యు ఎస్ పి సి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా చేపడుతున్న నాలుగు దశల పోరాటాల్లో భాగంగా శుక్రవారం స్థానిక జడ్పీహెచ్ఎస్ నడిగూడెం పాఠశాలలో ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసనను తెలియజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ లోకం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. శాంతియుత మార్గంలో, బాధ్యతాయుతంగా విధులకు అంతరాయం కలగకుండా తమ నిరసనను వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

## డాక్టర్ ముత్తు దాతృత్వం అభినందనీయం: సర్పంచ్ దున్నా శ్రీనివాస్

**నడిగూడెం, ఆగస్టు 7 ( నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్ ) :**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ కొల్లు పాపయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కే. శ్రీదేవి అధ్యక్షతన స్కూల్ డైరీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ శ్రీనివాస్, స్థానిక ఎస్ఐ తేజస్విని ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... చిలుకూరు మండలం కట్టకొమ్ముగూడెం గ్రామానికి చెందిన డాక్టర్ వేముల ముత్తు మిజోరాం సెంట్రల్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ విద్యా ఆవశ్యకతను గుర్తించి విద్యార్థులకు స్కూల్ డైరీలను ఉచితంగా అందజేయడం ఆయనకు విద్యపై ఉన్న మక్కువకు నిదర్శనమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, అంకితభావంతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉచితంగా డైరీలను అందజేసిన ప్రొఫెసర్ డాక్టర్ ముత్తుకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, షేక్ మీరాజుద్దీన్, ఎండి మౌలానా, కే. అశోక్ గౌడ్, బి. వెంకటేశ్వర్లు, జుట్టుకొండ నవీన్, వేపూరి పర్వతాలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను నివారించడంలో పోలీసులదే కీలక పాత్ర

- 18 సీసీ కెమెరాలు, 2 ఏఎన్‌పీఆర్ కెమెరాలు ప్రారంభం
- నేరాల నియంత్రణ, వాహనాల కదలికలపై నిరంతర నిఘా
- ఐటీసీ సహకారంతో భద్రతా వ్యవస్థ బలోపేతం
- ప్రజలు డ్రగ్స్, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.



మనోహరబాద్ ఐటీసీ కంపెనీ సంస్థ సహకారంతో కుచారం గ్రామంలో,బంగారమ్మ టెంపుల్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన 18 సీసీ కెమెరాలు, 2 ఏఎన్‌పీఆర్ కెమెరాలను శుక్రవారం కూచారం సర్పంచ్ రాజనాల చిత్ర రఘు తో కలిసి మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ప్రారంభించారు. నేషనల్ హైవే అధికారులతో కలిసి బంగారమ్మ దేవాలయం, కూచారం చేరస్తా వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి వాటిని బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా వాహనాలకు గ్రామస్తులకు ప్రత్యామ్నాయ భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు డివైడర్ ఓపెనింగ్ లు గ్రామాల అనుసంధానం వద్ద వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన భద్రత చర్యలు ఏర్పాటు చేయాలనీ ఆదేశించారు, కుచారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని పేర్కొన్నారు. గ్రామానికి వచ్చే వాహనాల రాకపోకలపై నిరంతరం నిఘా ఉంచేందుకు కెమెరాలు ఎంతో గానో ఉపయోగపడతాయని తెలిపారు. నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడంతో పాటు దర్యాప్తులో కీలక ఆధారాలను సేకరించేందుకు సీసీ కెమెరాల దృశ్యాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనుమానాస్పద వ్యక్తుల, వాహనాల కదలికలను పర్యవేక్షించడంతో పాటు నేరాలు జరగకుండా ముందస్తు నిరోధక చర్యలు చేపట్టేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంలోనూ ఇవి కీలకంగా పనిచేస్తాయన్నారు. ఏఎన్‌పీఆర్ కెమెరాల ద్వారా వాహనాల నంబర్ ప్లేట్లను గుర్తించే అవకాశం ఉంటుందని, అనుమానాస్పద లేదా నేరాలకు సంబంధం ఉన్న వాహనాలను గుర్తించడంలో ఈ సాంకేతికత పోలీసులకు ఉపయోగపడుతుందన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే 1908కు లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులకు వెల్లడించవద్దని, గుర్తుతెలియని లింకులను తెరవవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, తూప్రాన్ సీఐ వెంకట్ రాజా గౌడ్,సందీప్ రెడ్డి, ఎస్ఐ సుభాష్ గౌడ్, నేషనల్ హైవే అధికారులు, ఐటీసీ కంపెనీ సంస్థ ప్రతినిధులు,కూచారం సర్పంచ్ రాజనాల చిత్ర రఘు , ఉప సర్పంచ్ ఆంజనేయులు యాదవ్, గ్రామ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలకు సిద్ధం కావాలి

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాసరావు

**వేములపల్లి, ఆగస్టు 7 (నవజ్యోతి ప్రతినిధి) :**



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై గ్రామ గ్రామాన పోరాటాలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం వేములపల్లి మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు పెదమాం భరత్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాధినేని శ్రీనివాసరావు పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి పాలన సాగిస్తోందని విమర్శించారు. ప్రజల సమస్యలపై బీజేపీ నాయకులు నిరంతరం స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామంలో పూర్తి స్థాయి పార్టీ కమిటీలను ఏర్పాటు చేసి, పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై గ్రామస్థాయిలో ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బంటు సైదులు, ఎడ్ల రమేష్ కుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చల్లమల్ల సీతారాంరెడ్డి, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి పందిరి భాగ్యమ్మ, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బుల్లెదు లవయ్య, మండల ఉపాధ్యక్షుడు పెదమాం ప్రసాద్, మండల కార్యదర్శులు చింతకాయల సైదులు, లేకిరెడ్డి ప్రసాద్ రెడ్డి, మండల నాయకులు చక్కని ఉపేందర్, మానపురి పురుషోత్తం, మాతంగి ప్రభాకర్, నిమ్మనగోటి మహేష్, ఇరుగుదిండ్ల నరేష్, పేరం విలేఖర్, కంకణాల కుమార్, మధు, నితీష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాకీ వ్యూహానికి చిక్కిన అంతర్రాష్ట్ర దొంగ

- సీసీటీవీ క్లూలతో దొంగను పట్టుకున్న నల్లగొండ పోలీస్ యంత్రాంగం
- రూ.3.25 లక్షల నగదు, స్కూటీ, చోరీ పరికరాల స్వాధీనం
- పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం ప్రత్యేక బృందాల గాలింపు

**నల్గొండ, ఆగస్టు 07 (నవజ్యోతి ప్రతినిధి)**



పట్టణంలో ఇటీవల వరుస పగటి చోరీలతో ప్రజల్లో నెలకొన్న ఆందోళనకు తెరదించుతూ జిల్లా పోలీసులు అంతర్రాష్ట్ర దొంగ ముఠాను ఛేదించారు. ఢిల్లీకి చెందిన ఓ కరడుగట్టిన దొంగను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.3.25 లక్షల నగదు, స్కూటీతో పాటు చోరీకి వినియోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ జి.రమేష్, డీఎస్పీ కె.శివరాం రెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ ఎం.రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ కె.ఆది రెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐ సైదా బాబు నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారం, ఇతర కీలక క్లూలను విశ్లేషిస్తూ పోలీసులు ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగారు. ఈ క్రమంలో పానగల్ బైపాస్ వద్ద ఉచ్చు వేసి ఢిల్లీకి చెందిన మహమ్మద్ నసీమ్ (48) ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నల్గొండ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, తిరుపతి జిల్లాలు, ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్, ఢిల్లీలో జరిగిన పలు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.3.25 లక్షల నగదు, డియల్ 5ఎస్ డియస్ 1374 నంబరు గల స్కూటీ, రెండు ఇనుప రాడ్లు, మాస్క్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు చెందిన ఇర్షాద్, షరీఫ్ పరారీలో ఉండగా, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు వివిధ రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐలు డి.సైదా బాబు, ముత్తయ్య, జి.మానస, పోలీసు సిబ్బంది రబ్బాని, శంకర్, అంజద్, లావూరి బాలకోటి, మహమ్మద్ షకీల్, జానకిరాములు, హోంగార్డు శ్రీనులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## పైప్‌లైన్ దోపిడీకి చెక్..విజిలెన్స్ ఆకస్మిక దాడులు

- నీటి చోరీపై కొరడా..చింతల్ సర్కిల్‌లో 15 మోటార్లు స్వాధీనం
- తాగునీటి సరఫరాకు అడ్డుకట్ట వేస్తే చర్యలే..విజిలెన్స్ హెచ్చరిక

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7: (నవజ్యోతి ప్రతినిధి)**

ప్రభుత్వం ప్రజలకు సమానంగా తాగునీరు అందించాలనే లక్ష్యంతో చర్యలు చేపడుతుండగా, కొందరు అక్రమంగా నీటి మోటార్లు ఏర్పాటు చేసి సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తున్న వారిపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ విజిలెన్స్ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఎండి అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు చింతల్ సర్కిల్ పరిధిలోని విజయనగర్ కాలనీ, భగత్‌సింగ్ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 15 అక్రమ నీటి మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సందర్భంగా అధికారులు అక్రమంగా పైప్‌లైన్లకు మోటార్లు అనుసంధానం చేసి నీటిని లాగుతున్న ఘటనలను గుర్తించారు. ఇలాంటి చర్యల వల్ల చివరి వరుసలో ఉన్న వినియోగదారులకు తాగునీటి సరఫరా తగ్గిపోవడమే కాకుండా, నీటి పంపిణీ వ్యవస్థ మొత్తం దెబ్బతింటోందని అధికారులు పేర్కొన్నారు. అక్రమ మోటార్ల వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఇంటికి




సమానంగా తాగునీరు అందేలా ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, రానున్న రోజుల్లో నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐ విక్రమ్ రెడ్డి, అధికారులు రమేష్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN